క్లుప్తంగా

సన్మానం



భూపాలపల్లి రూరల్ : సింగరేణి కేటీకే–1 ఇంక్లైన్ గనిలో జనరల్ మజ్దూర్‌గా పని చేసి పదవి విరమణ పొందిన అంబటి లక్ష్మణ్‌ను మంగళవారం గని అధికారులు ఐఎన్‌టీయూసీ నాయకులు సన్మానించారు. ఈసందర్భంగా మేనేజర్ తిరుపతి, ఇంజనీర్ ప్రవీణ్ మాట్లాడారు.అధికారులు, కార్మికులు పాల్గొన్నారు.

శుభ్రతతోనే వ్యాధులు దూరం

కన్నాయిగూడెం : వ్యక్తిగత, పరిసరాల శుభ్రత పాటిస్తేనే వ్యాధులు దరిచేరవని స్థానిక ఎంసీహెచ్ వైద్యులు ఎం.గిరి అన్నారు. మండలంలోని లక్ష్మీపురం, దేవాదుల తుపాకులగూడెం పాఠశాలల్లో మంగళవారం వైద్యశిబిరం ఏర్పాటు చేశారు. విద్యార్థులకు పరీక్షలు చేసి మందులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ గిరి మాట్లాడారు.హెల్త్ అసిస్టెంట్ లక్ష్మణ్, ఏఎన్ఎం సవిత,ఆశాలు పాల్గొన్నారు.

నంబర్ లేకున్నా ఇంటిపన్ను

ఎస్ఎస్‌తాడ్వాయి : మండలంలోని రంగాపూర్ గ్రామ పంచాయతీలో ఇంటి నంబర్ లేకున్నా ఇందిరమ్మ ఇళ్ల సర్వే పేరుతో పంచాయతీ కార్యదర్శి రవి కొంతమంది లబ్ధిదారుల నుంచి ఇంటి పన్ను వసూళ్లు చేస్తున్నారని స్థానికుడు విష్ణువర్ధన్ మంగళవారం ఆరోపించారు. రంగాపూర్ గ్రామపంచాయతీ పరిధిలోని ఇందిరమ్మ ఇంటింటి సర్వేలో ఒకే ఇంట్లో మూడు కుటుంబాలు నివసిస్తున్నాయని ఇంటి నంబర్ ఒకటే ఉందన్నారు. ఆ మూడు కుటుంబాలకు ఇళ్లు కూడా లేదని గ్రామపంచాయతీలో ఇంటి నంబర్ కూడా లేకున్నా పంచాయతీ కార్యదర్శి ఇంటి పన్ను వసూళ్లు చేశారన్నారు. ఈవిషయంపై ప్రశ్నిస్తే పొంతన లేని సమాధానాలు చెబుతున్నాడన్నారు. కార్యదర్శి సొంత రశీదులు రాసి ఇస్తూ ఒక్కొక్కరి నుంచి ఇంటి నంబర్ పేరుతో రూ. 200 నుంచి రూ. 300 వసూళ్లు చేస్తున్నారని పేర్కొన్నారు. గ్రామంలో కొంత మందికి సొంత ఇల్లు లేదు, గ్రామపంచాయతీలో ఇంటి నంబర్ నమోదు లేకున్నా ఇంటి పన్ను బలవంతంగా వసూళ్లు చేస్తున్నారని ఆరోపించారు. అధికారులు విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

కోటలో పర్యాటకుల సందడి



కాకతీయ తోరణం ఎదుట కుటుంబంతో కాటారం సబ్ కలెక్టర్ మయాంక్

ఖిలా వరంగల్: కాకతీయుల నిర్మాణ శైలి, శిల్పకళ సంపద చాలా అందంగా ఉందని కాటారం సబ్ కలెక్టర్ మయాంక్ కొనియాడారు. ఖిలా వరంగల్ మధ్యకోటలోని శిల్పాల ప్రాంగణాన్ని మయాంక్ తన కుటుంబ సభ్యులతో కలిసి మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా నాలుగు కాకతీయ కీర్తితోరణాల నడమ ఉన్న ఆనాటి శిల్పులు నల్లరాతిలో చెక్కిన అద్భుత శిల్పకళా ఖండాలను సబ్ కలెక్టర్ ఆసక్తిగా తిలకించారు. అనంతరం రాతి, మట్టికోట అందాలతోపాటు ఏకశిల చిల్డ్రన్ పార్కు, ఏకశిల గుట్ట, ఖుష్‌మహల్‌ను సందర్శించి కాకతీయ కట్టడాలు, శిల్ప సంపదను ఆసక్తిగా చూశారు. చారిత్రక కట్టడాల గురించి కోట గైడ్ రవీయాదవ్ వివరించారు. కేంద్ర పురావస్తు శాఖ కో ఆర్డినేటర్ శ్రీకాంత్, టీఎస్‌టీడీసీ కోఆర్డినేటర్ గట్టికొప్పుల అజయ్, సిబ్బంది పాల్గొన్నారు.

క్యాలెండర్ ఆవిష్కరణ

గోవిందరావుపేట : మండలంలోని పలు పాఠశాల్లో టీఎస్ యూటీఎఫ్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో టీఎస్‌యూటీఎఫ్–2025 క్యాలెండర్‌ని ఆవిష్కరించారు. జూనియర్ కళాశాల, గర్ల్స్ జెడ్పీహెచ్ఎస్ గోవిందరావుపేట, ఎంపీపీఎస్ చల్వాయి పాఠశాలల్లో మంగళవార మండల అధ్యక్షుడు ఈక లక్ష్మినారాయణ ఆధ్వర్యంలో క్యాలెండర్ ఆవిష్కరించారు.

ఇందిరమ్మ ఇళ్లపైనే ఆశలు

- కొనసాగుతున్న ఇంటింటి సర్వే
- దశాబ్దాలుగా ఎదురుచూస్తున్న పేదలు



పెద్దంపల్లిలో కొనసాగుతున్న ఇందిరమ్మ ఇళ్ల సర్వే



టేకుమట్లలో..

టేకుమట్ల : ఉమ్మడి రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం పార్టీలకతీతంగా ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేసింది. కాగా లబ్ధిదారులు వాటిని నిర్మించుకుని అందులో నివసిస్తున్నారు. అయితే గ్రామాల్లో పెరుగుతున్న కుటుంబాలతో మరిన్ని ఇళ్లు నిర్మించుకునేందుకు నిరుపేదలు ప్రభుత్వ చేయూత కోసం ఎదురు చూస్తున్నారు. 2014లో తెలంగాణ ఆవిర్భావంతో బీఆర్ఎస్ ప్రభుత్వం డబుల్ బెడ్రూం ఇళ్ల పథకాన్ని ప్రారంభించింది. మండలంలో 24 గ్రామ పంచాయతీలు ఉండగా రాఘవాపూర్, గర్మిళ్లపల్లి, ద్వారకపేట, రామకిష్టాపూర్(వి), ఎంపేడు గ్రామాల్లో ఒక్కో గ్రామానికి 50 డబుల్ బెడ్రూం ఇళ్లను మంజూరు చేశారు. కానీ పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో ద్వారకపేట, ఎంపేడులో ఇప్పటికీ పూర్తిస్థాయిలో డబుల్ బెడ్రూం ఇళ్ల నిర్మాణం పూర్తి కాకపోవడంతో లబ్ధిదారులు నిరాశలో ఉన్నారు.

ఇందిరమ్మ ఇళ్లపైనే ఆశలు..

గత ప్రభుత్వ హయాంలో డబుల్ బెడ్రూం ఇళ్లు పొందిన లబ్ధిదారులు తప్ప ప్రతీ గ్రామంలో పాత ఇళ్లు, పూరి గుడిసెల్లో ఎంతో మంది నిరుపేదలు జీవనం సాగిస్తున్నారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వంలో అందించే ఇందిరమ్మ ఇళ్లపై ఎన్నో ఆశలు పెట్టుకున్నారు. ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపిక పారదర్శకంగా ఉండేందుకు గ్రామాల్లోని పంచాయతీ కార్యదర్శులకు విధులు కేటాయించడంతో సర్వే నిరంతరం కొనసాగుతోంది. కానీ ప్రజా పాలన దరఖాస్తుల్లో కొంత మంది పేర్లు గల్లంతు అవ్వడంతో నిరుపేదలు ఆందోళన చెందుతున్నారు. నియోజక వర్గంలో 3,500 ఇళ్లు మంజూరు కావడంతో గ్రామానికి 10 నుంచి 15మాత్రమే వచ్చే అవకాశం ఉంది. దీంతో మొదటి విడతలో వ్యవసాయ భూమి లేకుండా, ఇల్లు నిర్మించుకునేందుకు స్థలం ఉన్న వారికి మొదటి ప్రాధాన్యత కల్పించడంతో నిరుపేద లబ్ధిదారులు ఇందిరమ్మ ఇళ్లపై ఆశలు పెంచుకుంటున్నారు. కానీ ఇందిరమ్మ ఇళ్లలో అక్రమాలు చోటు చేసుకుంటే అర్హులు సైతం అనర్హులు అవుతారనే సందిగ్ధంలో ఉన్నారు. గత కాంగ్రెస్ పాలనలో ప్రతీ గ్రామానికి ఇందిరమ్మ ఇళ్లు మంజూరయ్యాయని, ప్రస్తుత కాంగ్రెస్ పాలనలో మళ్లీ ప్రతీ గ్రామానికి ఇందిరమ్మ ఇళ్లు మంజూరు కానుండడంతో ఆనందం వ్యక్తంచేస్తున్నారు.

గుడిసెలోనే ఉంటున్నా..



తండ్రి, తాతల కాలం నుంచి పూరి గుడిసెలోనే ఉంటున్నాము. ఆర్థిక స్థోమత లేక అదే గుడిసెలో నివసిస్తున్నా. బీఆర్ఎస్ హయాంలో ఇళ్లు వస్తుందని ఆశపడ్డాం. కానీ రాలేదు. ఇప్పుడు కాంగ్రెస్ హయాంలో తప్పకుండా ఇళ్లు మంజూరు అవుతుందనే పూర్తి నమ్మకంతో ఉన్నాం. అర్హులైన లబ్ధిదారులను ఎంపిక చేయాలని, ఎలాంటి అక్రమాలకు చోటు లేకుండా పారదర్శకంగా ఎంపిక చేస్తారని అనుకుంటున్నా.

– ఎరివెల్లి మహేష్, టేకుమట్ల

పారదర్శకంగా ఎంపిక చేస్తున్నాం..



ఇందిరమ్మ ఇళ్ల ఎంపికలో పాటించాల్సిన నియమాల ప్రకారమే సర్వే కొనసాగిస్తున్నాం. గ్రామంలోని ప్రతీ వ్యక్తి జీవన విధానం, ఆర్థిక స్థితిగతులను పరిగణలోకి తీసుకుంటున్నాం. ఎలాంటి అక్రమాలకు తావు లేకుండా సర్వే నిర్వహిస్తున్నాం. తప్పుడు సమాచారం అందిస్తే క్రాస్ చెక్ చేస్తున్నాం. అర్హులందరి వివరాలను సర్వేలో నమోదు చేస్తున్నాం. ప్రజలు కూడా నిజాలను మాత్రమే చెప్పాలని కోరుతున్నాం.

– ఇనగాల సురేష్, పంచాయతీ కార్యదర్శి, పెద్దంపల్లి

కేజీబీవీ ఎదుట నిరసన



నిరసన తెలుపుతున్న ఏబీవీపీ నాయకులు

చిట్యాల : మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం ఎదుట ఏబీవీపీ నాయకులు మంగళవారం నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా నగర కార్యదర్శి బుర్ర అభిజ్ఞ మాట్లాడుతూ.. 25 రోజుల నుంచి పాఠశాలలో ఉపాధ్యాయులు లేకపోవడంతో విద్యార్థులకు సిలబస్ పూర్తికావడం లేదని, దీంతో నష్టపోతున్నారని చెప్పారు. కనీసం వారిని పట్టించుకున్న పాపాన పోలేదని వివరించారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం స్పందించి విద్యార్థులు నష్టపోకుండా సిలబస్ పూర్తయ్యేలా చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు అవినాష్, అజయ్, తదితరులు పాల్గొన్నారు.

పౌరహక్కులపై అవగాహన



ఎలికేశ్వరంలో అవగాహన కల్పిస్తున్న తహసీల్దార్

కాళేశ్వరం : మహదేవపూర్ మండలం ఎలికేశ్వరం గ్రామపంచాయతీ కార్యాలయం ఆవరణలో మంగళవారం పౌర హక్కుల దినోత్సవాన్ని తహసీల్దార్ ప్రహ్లాద్ రాథోడ్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఎస్సీ, ఎస్టీలపై వివక్ష, అంటరానితనం చూపకూడదని వివరించారు. వివక్షను నిర్మూలించేందుకు చట్ట పరమైన ఎటువంటి చర్యలు తీసుకుంటారో వారికి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో నాయబ్ తహసీల్దార్ కృష్ణ, గిర్దావర్ బి.జగన్‌మోహన్‌రెడ్డి, ఎంపీఓ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

‘మాంజా’తో యువకుడికి గాయాలు

భూపాలపల్లి అర్బన్ : గాలిపటం ఎగురవేసే మాంజా దారం మెడకు చుట్టుకొని ఓ యువకుడికి గాయాలైన సంఘటన భూపాలపల్లి పట్టణంలో చోటుచేసుకుంది. బాధితుడు తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణంలోని సుభాష్ కాలనీకి చెందిన సముద్రాల అజయ్ తన ద్విచక్ర వాహనంపై జయశంకర్ సెంటర్ నుంచి సుభాష్‌కాలనీ వైపునకు మంగళవారం వెళ్తున్నాడు. ఈ క్రమంలో మార్గమధ్యలో కూరగాయల మార్కెట్ సమీపంలో గాలిపటాలు చిన్నారులు ఎగురవేస్తుండగా దాని మాంజా అజయ్ మెడకు చుట్టుకుంది. దీంతో బైక్ అదుపు తప్పి కిందపడిపోయాడు. మెడకు స్వల్పంగా కోసుకోవడంతో అతడికి రక్తస్రావమైంది. కాగా సదరు వ్యక్తి మాంజా గమనించకుండా వేగంగా వెళ్తే ప్రాణాపాయం కలిగేదని, స్థానికులతో పాటు ఆ యువకుడు ఆవేదన వ్యక్తం చేశాడు.

కొనసాగుతున్న ఎస్ఎస్ఏల దీక్ష



కలెక్టరేట్ ఎదుట దీక్ష చేస్తున్న సమగ్ర శిక్ష ఉద్యోగులు

భూపాలపల్లి అర్బన్ : విద్యాశాఖలోని వివిధ విభాగాల్లో విధులు నిర్వర్తిస్తున్న సమగ్ర శిక్ష కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు తమ సమస్యలను పరిష్కరించాలని చేపట్టిన దీక్షలు కొనసాగుతున్నాయి.ఈ దీక్షలు మంగళవారం 22వ రోజుకు చేరుకున్నాయి. కలెక్టరేట్ ఎదుట చేపట్టిన దీక్షకు గిరిజన ఉద్యోగుల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు హాథీరాం నాయక్ మద్దతు తెలిపారు. సమాన పనికి.. సమాన వేతనం చెల్లించాలని, ప్రమాద బీమా అమలు చేయాలని, 61 సంవత్సరాలు నిండిన వారికి రిటైర్మెంట్ బెనిఫిట్స్ కల్పించాలని, అన్ని రకాల ప్రసూతి సెలవులు అమలు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు, ఉద్యోగులు చాంద్‌పాషా, సునీత, వేణు, మహేందర్‌రెడ్డి, చంద్రకళ, నరేష్, రాజు, తిరుపతితో పాటు తదితరులు పాల్గొన్నారు.

మిరపలో నల్లి నివారణకు చర్యలు



మిర్చి పంటను పరిశీలిస్తున్న తిరుపతిరావు

చిట్యాల : రైతులు సాగు చేస్తున్న మిరప పంటలో నల్లి నివారణకు చర్యలు చేపట్టనున్నట్లు ప్రగతి అగ్రిసైన్స్ డైరెక్టర్, జిల్లా వ్యవసాయ సంక్షేమ సంఘం సొసైటీ అధ్యక్షుడు సిరికొండ తిరుపతిరావు అన్నారు. ఈసందర్భంగా మంగళవారం మండలంలోని బావుసింగ్‌పల్లి, నవాబుపేట, చింతకుంట రామయ్యపల్లి గ్రామాల్లో రైతులతో కలిసి మిరప పంటలను పరిశీలించారు. మిరప పంటలో నల్లిపురుగు ఉధృతంగా ఉండడం వల్ల చెట్టు కొసలు మాడిపోవడం, నల్లబడిపోవడం జరుగుతుందన్నారు. రైతులు జాగ్రత్త వహించి నల్లి పురుగు నివారణకు కచ్చితంగా పని చేసే మందులను మాత్రమే పిచికారీ చేయాలని కోరారు. రెండేళ్ల నుంచి నల్లి ఉధృతిని గమనించి ప్రగతి సైన్స్ మార్గో పవర్ మందును వాడి మిరప పంటలను కాపాడుకోవాలని సూచించారు. ప్రగతి అగ్రిసైన్స్ డీలర్ గుమ్మడి సత్యం, రైతులు పాల్గొన్నారు.

తహసీల్దార్‌కు వినతి



తహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న జర్నలిస్టులు

భూపాలపల్లి రూరల్ : జిల్లా కేంద్రంలో ప్రెస్ క్లబ్ భవన నిర్మాణానికి స్థలం కేటాయించాలని కోరుతూ కాకతీయ ప్రెస్ క్లబ్ జర్నలిస్టులు మంగళవారం స్థానిక తహసీల్దార్ శ్రీనివాసులుకు వినతిపత్రం అందించారు. ప్రజలు తమ సమస్యలు, వినతులు వెల్లడించడం కోసం ఇబ్బందులు పడుతున్నారని జిల్లా కేంద్రంలో ప్రెస్ క్లబ్ అవరమన్నారు. అధికారులు స్పందించి జిల్లా కేంద్రంలో ప్రెస్‌క్లబ్‌కు అనువైనా స్థలం కేటాయించాలని విజ్ఞప్తి చేశారు. వినతి పత్రం ఇచ్చిన వారిలో సామల శ్రీనివాస్, బెల్లం తిరుపతి, దొమ్మటి రవీందర్, తడుక సుధాకర్, దేవేందర్, సృజన్ ఉన్నారు.

కంకర తేలి.. గుంతలుగా మారి



పగుళ్లు ఏర్పడిన సీసీ రోడ్డు



రోడ్డు నిర్మించాలని కోరుతున్న గ్రామస్తులు



సీసీ రోడ్డుపై ఏర్పడిన గుంత

ప్రమాదకరంగా ఎస్సీకాలనీ సీసీ రోడ్డు

- పట్టించుకోని ప్రత్యేకాధికారులు
- మరమ్మతు చేయాలని స్థానికుల వేడుకోలు

మల్హర్ : సీసీ రోడ్డుపై కంకర తేలి, బీటలు ఏర్పడి, గుంతలమయంగా మారింది. దీంతో ఈ రోడ్డు ప్రమాదాలకు నెలవుగా మారుతున్నాయి. రాత్రి పూట అయితే పరిస్థితి చెప్పనవసరం లేదు. ఆ రోడ్లపై ప్రయాణం చేయాలంటేనే కత్తిమీద సాములా ఉంటుంది. సీసీ రోడ్డు అధ్వానంగా మారినా ప్రత్యేక అధికారుల పర్యవేక్షణ కరువైంది. సీసీరోడ్లు ధ్వంసమవుతున్న వాటిని పట్టించుకునే నాథుడే కరువయ్యారు. కంకర తేలిన రోడ్లతో వాహనదారులు, గ్రామస్తులు పలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.పెద్దతూండ్ల గ్రామ పంచాయతీ పరిధిలో ఎస్సీ కాలనీ సీసీ రోడ్ల పరిస్థితి ఇది.

అదుపు తప్పుతున్న వాహనాలు

మండలంలోని పెద్దతూండ్ల ఎస్సీ కాలనీ సీసీరోడ్లు అన్ని ధ్వంసమయ్యాయి. అడుకో గుంత, గజానికో గొయ్యిలా పరిస్థితి ఉంది. గుంతల రోడ్లపై ప్రయాణం గ్రామస్తులకు, వాహనదారులకు ప్రాణసంకటంలా ఉంది. రోడ్ల మరమ్మతులు చేయక పరిస్థితి మారింత దారుణంగా తయారైంది. ఈ రోడ్డుపై నడిపిన బైక్‌లు, కార్లు, ఆటోలు ఇలా అన్నింటికీ రిపేర్లు వస్తున్నాయి. కంకర తేలి, గుంతలు ఏర్పడ్డ రోడ్డుపై వాహనదారులు, ప్రయాణికులు అదుపు తప్పి పడిపోయి గాయపడుతున్నారు. రోడ్లు బాగా లేక వచ్చిన ఆదాయం వాహనాల రిపేర్లకే సరిపోతుందని ఆటో డ్రైవర్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ద్విచక్ర వాహనదారులు సైతం బైక్ రిపేర్లకు వందల్లో వెచ్చిస్తున్నారు. అధికారులు స్పందించి దెబ్బతిన్న రోడ్లకు మరమ్మతులు చేయించాలని కాలనీ వాసులు పింగిళి బాపు, నక్క మల్లేష్, పింగిళి సారయ్య, సమ్మయ్య, రాములు వేడుకుంటున్నారు.

సీసీ రోడ్డు వేయాలి



ఎస్సీ కాలనీ సీసీ రోడ్డుపై గుంతలు ఏర్పడి, కంకర తేలి ప్రమాదకరంగా ఉంది. పిల్లలు, మహిళలు, వృద్ధులు, దివ్యాంగులు ప్రయాణం చేస్తూ కిందపడుతున్నారు. ఎన్నిసార్లు అధికారులకు విన్నవించిన పంటించుకోవడం లేదు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఎస్సీ కాలనీ నుంచి బొమ్మ వరకు కొత్త సీసీ రోడ్డు వేయాలి

– పింగిళి బాపు, పెద్దతూండ్ల, మల్హర్‌రావు

సెల్‌ఫోన్ల అప్పగింత

భూపాలపల్లి రూరల్ : భూపాలపల్లికి చెందిన కట్కూరి కుమార్, సల్ల రవీందర్, బిజిగ శ్రీను తమ సెల్‌ఫోన్‌లను పోగొట్టుకున్నారు. కాగా సీఈఐఆర్ సాయంతో పోలీసులు సెల్‌ఫోన్లను వెతికి మంగళవారం పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో బాధితులకు సీఐ నరేష్‌కుమార్ అందజేశారు.

జమిలి ఎన్నికలు రాజ్యాంగ విరుద్ధం

- మాలమహానాడు రాష్ట్ర అధ్యక్షుడు కిరణ్

కాటారం : కేంద్ర ప్రభుత్వం తీసుకు వస్తున్న జమిలి ఎన్నికలు రాజ్యాంగ విరుద్ధమని ఉత్తర తెలంగాణ మాలమహానాడు రాష్ట్ర అధ్యక్షుడు పీక కిరణ్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. జమిలి ఎన్నికలతో ఏక పార్టీ బీజేపీ పాలన వస్తోందని ఆరోపించారు. బీజేపీ పాలన నిమ్న వర్గాల ప్రజల జీవితాలను చిన్నాభిన్నం చేస్తోందన్నారు. నల్లచట్టాలను అమలు చేస్తూ రాజ్యాంగ బద్ధ సంస్థలను నిర్వీర్యం చేసే కుట్రలు పన్నుతోందని విమర్శించారు. కేంద్రం,. రాష్ట్రంలో ఎన్నికల వరకే బీజేపీ హిందువులం, బంధువులం అని అనంతరం శ్రామిక వర్గ ప్రజల మధ్య కులం, మతం అంటూ వైరుధ్యాలు సృష్టిస్తుందని కిరణ్ పేర్కొన్నారు.

ఉత్సాహంగా న్యూ ఇయర్ వేడుకలు



మల్హర్: కేక్ కట్ చేస్తున్న టీచర్లు, విద్యార్థులు



భూపాలపల్లి అర్బన్ : కేక్ కట్ చేసి స్వీట్లు తినిపించుకుంటున్న నాయకులు

మల్హర్ : మండలంలోని తాడిచర్ల సాయివాణి విద్యానికేతన్, వల్లెకుంట దేవి విద్యోదయ తదితర పాఠశాలల్లో ఉపాధ్యాయులు, విద్యార్థులు ముందస్తు నూతన సంవత్సర వేడుకలను మంగళవారం జరుపుకున్నారు. విద్యార్థులు, ఉపాధ్యాయులు ముగ్గులు వేసి, ఆట, పాటలతో అలరించారు. అనంతరం కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

గ్రీన్‌వుడ్‌లో..

కాళేశ్వరం : మహదేవపూర్ మండల కేంద్రంలోని గ్రీన్‌వుడ్ స్కూల్‌లో మంగళవారం న్యూ ఇయర్ వేడుకలను కేక్ కట్‌చేసి విద్యార్థులతో కలిసి ఉపాధ్యాయులు జరుపుకున్నారు. కరస్పాండెంట్ శ్రీనివాస్‌రెడ్డి, హెచ్‌ం శ్రీనివాస్‌రెడ్డి, డైరెక్టర్ రాజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

సీపీఐ ఆధ్వర్యంలో..

భూపాలపల్లి అర్బన్ : నూతన సంవత్సర వేడుకలను జిల్లా కేంద్రంలో సీపీఐ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. స్థానిక పార్టీ కార్యాలయంలో కేక్ కట్ చేసి సంబురాలు చేసుకున్నారు. పార్టీ నాయకులు స్వీట్లు పంపిణీ చేసుకొని నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలుపుకున్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ పట్టణ కార్యదర్శి సోత్కు ప్రవీణ్‌కుమార్, సతీష్, నాయకులు పాల్గొన్నారు.



కాళేశ్వరం: కేక్‌కట్ చేస్తున్న ఉపాధ్యాయులు



రంగులు కొనుగోలు చేస్తున్న స్థానికులు

విస్తృతంగా డ్రంకెన్ డ్రైవ్ పరీక్షలు



కాటారం: వాహనదారుడికి డ్రంకెన్ డ్రైవ్ టెస్ట్ చేస్తున్న ఎస్సై అభినవ్



మల్హర్: వాహనదారుడికి డ్రంకెన్ డ్రైవ్ టెస్ట్ చేస్తున్న ఎస్సై నరేశ్

కాటారం : నూతన సంవత్సర వేడుకల నేపథ్యంలో జిల్లా ఎస్పీ కిరణ్‌ఖరే ఆదేశాల మేరకు మండలంలో మంగళవారం రాత్రి ఎస్సై మ్యాక అభినవ్ ఆదేశాల మేరకు పోలీసులు విస్తృతంగా డ్రంకెన్ డ్రైవ్ పరీక్షలు నిర్వహించారు. బైక్, ఇతర వాహనాల్లో వెళ్తున్న వారికి డ్రంకెన్ డ్రైవ్ పరీక్షలు చేశారు. మద్యం తాగి వాహనాలు నడిపిన వాహనదారులకు జరిమానాలు విధించి కౌన్సిలింగ్ ఇచ్చారు. కాగా పోలీస్ తనిఖీలు చేపడుతున్న విషయం తెలుసుకున్న పలువురు వాహనదారులు గల్లీ రహదారుల గుండా ప్రయాణించడానికి ప్రయత్నాలు చేసినప్పటికి పోలీసులు గల్లీ గల్లీ గస్తీ చేపట్టారు.

మద్యం తాగి బయటికు వస్తే కేసులు

మల్హర్ : కొత్త సంవత్సర వేడుకల నేపథ్యంలో మద్యం తాగి రోడ్లపైకి వస్తే కేసులు నమోదు చేస్తామని కొయ్యూరు ఎస్సై నరేష్ హెచ్చరించారు. జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు మండలంలోని కొయ్యూరు సెంటర్‌లో ఎస్సై నరేష్ తన సిబ్బందితో కలిసి మంగళవారం డ్రంకెన్ డ్రైవ్ తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా మంథని–కాటారం వైపు వెళ్తున్న వాహనాలను నిలిపి డ్రైవర్లకు, ద్విచక్ర వాహనదారులకు డ్రంకెన్ డ్రైవ్ టెస్ట్‌లు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. నూతన సంవత్సర వేడుకలు ప్రశాంతగా జరుపుకోవాలని సూచించారు. నిబంధనలు అతిక్రమిస్తే ఎంతటి వారినైన వదలేది లేదని వెల్లడించారు. మద్యం తాగి వాహనాలు నడిపితే కఠిన చర్యలతో పాటు కేసు నమోదు చేసి జైలుకు పంపించడం జరుగుతుందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పోలీస్ కానిస్టేబుళ్లు పాల్గొన్నారు.

మన్మోహన్ సింగ్‌కు ఘన నివాళి



టేకుమట్ల : దివంగత మాజీ ప్రధాని డాక్టర్ మన్మోహన్‌సింగ్‌కి మంగళవారం మండల కేంద్రంలో టేకుమట్ల సెక్టార్ అంగన్‌వాడీ టీచర్లు శ్రద్ధాంజలి ఘటించి, ఆయన చిత్ర పటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. అంగన్‌వాడీ టీచర్లు రామసల్ల స్వప్న, విమల, చంద్రకళ, తిరుపతమ్మ, భాగ్యలక్ష్మి, హిమబిందు, నిర్మల, విజయ తదితరులు పాల్గొన్నారు.